ఒక సవాలుగా పరిగణించి అనధికార పూర్వకంగా నీటి సరఫరా చేయాలి. కళాశాలలు మూస్తున్నారు గనక తమతమ అదుపులోవున్న విద్యార్థులను వినియోగించుకొని న్యాయంగా నిష్పక్ష పాతంగా, క్రమశిక్షణతో నీరు ప్రతి ఇంటికీ సమానంగా అందేటట్లు చేయాలి. ఎనికల్లో వేలకొలది రూపాయలు దుబారా చేయగలిగినవారు నీటి లారీలను సేకరించలేరా? తాము కొనలేకపోయినప్పటికీ, ఇతర నగరాలలో వ్యక్తులనుండి సంపాదింపలేరా? అన్ని విధాలా ప్రయత్నించి ప్రజలకు ఏమైనా మేలు చేయగలిగితే నగరం ఎద్దడినుంచి రక్షింపబడుతుంది. ఇప్పటిలాగ వందలాది జనం నీటి లారీ దగ్గరమూగి, ఇంటికి నీరు తీసికొనిరాక పోగా గాయాలతో తిరిగివచ్చే దుర్గతి మాత్రం మన స్త్రీలకు కలుగకూడదు. ఇపుడు ఏమీ ప్రయోజనం చేయలేకపోతే వివిధ సంస్థల వారూ తమ కార్యాలయాలు గుంటూరులో మూసివేసుకొన్నట్లయినా ప్రకటించాలి,"

"మంచి మాటన్నారు."

కథానిక

# కనబడని ముల్లు

టేకుమళ్ల కామేశ్వరరావు

జిల్లాబోర్డు వారి ఆర్డరు ప్రకారం మొక్కలూరు చేరుకొన్నాను. ఈ కుగ్రామంలో సంసారం పెట్టడానికి తగిన కొంపే లేదన్న సంగతి అలాగుంచండి. నేను ఒక్క మనిషినే అయినా విద్యానిబంధనల ప్రకారం రాత్రింబగళ్లు బడిలో ఉండడానికి వీలులేదు. కాబట్టి గది అద్దెకి తీసుకొన్నాను. గొల్లవాడు మేకల్ని పోగుచేసుకొని వచ్చినట్లు పిల్లల్ని పోగు చేసుకొనివచ్చి విద్యాసేవ ప్రారంభించేను.

మొక్కలూరు గ్రామంలో ఉన్నది ఒక్క వీధే! దానిలో ఒకటో రెండో చిన్న పెంకుటి కొంపలున్నాయి. ఆ వీథి చుట్టుపట్ల తాటాకు గుడిసెలున్నాయి. బీదగ్రామమని దాని వాలకమే చెపుతుంది. కాని ఇక్కడ డబ్బు పేదరికమా, జ్ఞాన పేదరికమా అని నా సమస్య.

పాతకాల విధుల ప్రకారం బడికొక చిన్న తోటను సమకూర్చాలి దానికయే ఖర్చు నిచ్చే దాత ఎక్కడా లేడు. స్వయంగా నే అక్కడా అక్కడా కాస్త కంపకొట్టి బడికి అని కొస్త మేర కంచెకట్టి, పిల్లలతో పాటు నేనూ శ్రమపడి, చిన్న తోటకి పునాది వేశాం. కాలం అనుకూలించగా తోట మిసమిస లాడుతూ వచ్చింది. ఫలసాయం కళ్లకి కనబడుతూంది. ఇంతా చేస్తే ఉన్న జాగా ఎంత! పాటుపడే వాళ్ల నేర్పెంత! ఇంతకి పేరేవుంది, నమూనా బడితోట అని. అది విద్య నేర్పడానికి వేసిన తోట కాని ఫలసాయం కోసం చేసిన ప్రయత్నం కాదు. అయినా ఊరి వారందరి కళ్లూ ఆ తోట మీదే ఉండేవి. పిల్లలు, నేనూ పడ్డ శ్రమకి సంతోషించి ప్రోత్సహించిన వారు లేకపోగా, "నాకో కొత్తిమీరి రెబ్బ పెట్టవా" అని ఒకడు, "తోటకూర కాడ ఇమ్మ"ని మరొకడు, "పువ్వులు దేవుడి పూజక"ని ఇంకొకడు, "మా ఇంటిలో కావాలంటున్నార"ని మరో ఆసామి, "మా పిల్లలచేత చేయించిన పనే కాబట్టి, తోట మాదే" అని మరో హక్కుదారుడు, ఇదీ వరస! వీరందరినీ తృప్తి పరచడానికి అక్కడున్న దెంత! పెళ్లికి చేసిన ప్రయత్నం పేరంటాళ్ల వాచకికి సరిపోయిందన్న సామెత లాగు వచ్చి పడింది. పోనీ కొస్త ఇచ్చి అందులో ఒకణ్ణేనా వదుల్చుకొందామంటే, "వాడెక్కువేమిటి, నా తక్కువేమిటి?" అని రెండోవాడు అందుచేత నోరున్నవాడికిచ్చి నోరులేని వాడికి ఊరుకొందా

మన్నా సాగలేదు. ఊరి కరణంగారొక వైపు పెద్ద. గ్రామ మునసబుగారు మరొక వైపు పెద్ద. మునసబుగారి బావమరిది ఆయనకంటె పెద్ద. ఇదంతా ఇమ్మని కొస్త మర్యాదగా అడిగిన మహానుభావుల్ని గురించి. ఎవరూ లేకుండా చూసి, బడి తోటలోకి జొరబడి ఎత్తుకుపోయిన వాడితో పేచీయే లేదు.

తోటమీద వచ్చిన ఆదాయం జమ కట్టమని మరొక విద్యా నిబంధన. అమ్మ జూపితే కొనీ ఇచ్చేవాడు లేడు, పెట్టకపోతే బెదిరింపే వాడే కాని. ఒకరా ఇద్దరసా దరఖాస్తు దారులు! ఉట్టిగిన్నె చుట్టూ కాకులు మూగినట్లే.

మొత్తంమీద నేను ఒక్కణ్ణికూడ తృప్తి పరచలేక పోయే నన్నమాట ఒప్పుకోక తప్పదు. అహా! పరమేశ్వరుడా! ఈ తోట లేకపోయినా బాగుండును! ఈ ఊళ్లో ఉద్యోగం చెయ్యక పోయినా బాగుండును!

నేను సాహసించి ఒకరిద్దరి నడిగేను "సరిగా కొలిస్తే బెత్తెడులేని ఈ బడితోట కోసం ఇలాగు అవస్థ పడతా రెందుకయ్యా. మీరు కొంపకొకతోట వేసుకోరాదా?" అని. దానికి చక్కటి సమాధానం వచ్చింది, "ఈ ఊళ్ళో ఆమాత్రం తెలియని పాపాత్ముడెవడూ లేడు. ఎవరి పెరటిలో నేనా మొక్కవేసు కొంటే తక్కిన వాళ్లు దానిని బతకనియ్యరు." అని. ఆ సమాధానం నన్ను నిరుత్తరుణ్ణే కాకుండా, నిర్ ప్రశ్నకుణ్ణిగా కూడ చేసి వేసింది. అక్కడితో ఆ సంభాషణ చాలించి బాతాఖానీ కోసం "మన ఊరికి మొక్కలూ రన్న పేరు ఎలాగు వచ్చిందియ్యా!" అని అడిగేను.

"ఇక్కడికి అందరూ మొక్కలు చెల్లించుకోడానికి వచ్చేవారు కామాలండి!" అన్నాడు పునాదిలేని ఒక పురాతత్వ శాస్త్రజ్ఞుడు,

"అలాగే అనుకొందాం మాటవరసకి. అయితే దాని కక్కడ ఒక పెద్ద దేవాలయమేనా ఉండి ఉండాలి కదా! ఏదీ? ఇప్పుడున్నది గ్రామదేవత గుడి అన్న పేరున కట్టబడ్డ పూరిగుడిసే కదా!" అన్నాను.

కాబట్టి వాళ్లెవరి వల్లా ఊరి పేరులోని సమస్య తెగక పోగా నాలో నేనే ఆలోచించేను. గమ్మున విడిపోయి నట్లనిపించింది. "మొక్క ఏల ఊరిలో!" అనే మాటఅనోట ఆనోట నలిగి మొక్కలూరయిందని నాకు గట్టిగా నమ్మకం కుదిరింది.

బడితోట సంబంధంగా ఊరివారితో వచ్చిన తగవులాటలు తీరే దారికోసం రాత్రింబగళ్లు తల బద్దలు చేసుకొన్నాను. చివరికి దానంతటదే మంచులాగు విడిపోయింది. ఎవడో ఒక మహానుభావుడు అర్థరాత్రిపూట బడితోట గేటుతీసి గొడ్లని లోపలకి తోలేడు. తెల్లవారి చూచే టప్పటికి అక్కడ ఒకప్పుడు తోట ఉండేదన్న జాడేనా లేకుండా పోయింది.

దేవుడు మేలు చెయ్యగా ఆ ఊళ్ళోంచి బైటపడ్డాను. ఒక పట్టణానికి బదిలీ అయింది. అదృష్టవంతుణ్ణిగా భావించేను. కుటుంబంతో ఉందామని ఒక చిన్నవాటా అద్దెకు తీసుకొన్నాను. సకుటుంబంగా అందులో చేరేను. ఇక్కడ తగాదాలు లేకుండా పడుండవచ్చని నా ఆశ.

ఆ ఇంటికి చుట్టూ పెరడుంది. నేనున్న వాటాకి గుమ్మం ముందే ఒక చిక్కుడు పందిరి ఉంది. ఎండవేళప్పుడు చల్లగా ఉంటుంది. మేము ఇంటిలోకి వెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు పందిరి కింది దూరి, వంగి నడవవలసిన అవస్థ పట్టింది. అద్దెవాళ్ళకి అంతకంటె సౌకర్య మెందుకు, ఏలాగో ఒకలాగు పడుంటారని కాబోలు, ఇంటి యజమానురాలి ధీమా!

తెల్లవారేటప్పటికి బోలెడంత చెత్త పందిరి కింద పడుండేది. అది తుడిచే నాథుడు లేడు. మేము ఎత్తుకోవలసిందే! మనకెందుకు పోనీ అని ఊరుకుందామంటే ఇంటిలోని పిల్లాజెల్లా అందరం తిరిగేదారి. ఆ చెత్తతోపాటు పురుగు పుట్ర చేరితే? అందుచేత ముంగిలి తుడుచుకోక తప్పదు.

పందిరిమీద తెల్లగా కొన్ని ఎర్రగా కొన్ని చిక్కుడు పువ్వులు గెలలు ఆకాశంవైపు నిక్కి చూస్తున్నాయి. క్రమంగా పిందెలు కాయలు బయలుపడ్డాయి.

రోజూ కాయలు కోసి పట్టుకుపోతూండడం ఇంటి యజమానురాలి పని. ఒకమాటు కాకపోతే మరొకమాటేనా గుప్పెడుకాయలు మాకు పెడుతుందేమో అని మా ఆవిడ కళ్లు

కాయలు కాసేటట్లా యెదురుచూసింది. ఫలితం మాత్రం శూన్యం.

చిక్కుడు కాయలకోసం పగటి దొంగలు, రాత్రి దొంగలుకూడ రావడం మొదలు పెట్టేరు. కాయలుంటితే కాయలు. లేకపోతే మా పిల్లలు ఆడుకొంటూ అక్కడ పారవేసిన గళాసో, చాక్కాయో, మరేదో చేత పట్టుకు జారిపోవడం. ఈ విధంగా పరిణమించింది. ఇది ఇట్లాగుండగా—

చిక్కుడు తీగకి వేసిన పందిరి రాటలు, కర్రలు ఇంటివారివి కావన్న సంగతి నాకు మొదటిలో తెలియలేదు. మా పొరుగువారితో మాకు స్నేహం ఏర్పడగా వాళ్లు "ఆ పందిరి రాటలు, కర్రలు మా ఇంట్లోవి. ఇప్పుడు మాకు ఎంతో అవసరంగా ఉంది. మేము కట్టించుకొంటూన్న ఇంటికి గోళలు కట్టడానికి అటకలకి కర్రలు చాలవని మేస్త్రీ రోజూ గోల పెడుతున్నాడు. మీ ఇంటావిణ్ణి ఇమ్మంటే ఇవ్వదు. కర్రలు మావి కదా పోనీ అని గుప్పెడు కాయలేనా మా మొహాన్ని కొడుతుందేమో అంటే కొట్టదు" అని అంగలార్చేరు. ఫలితం కళ్లపడేటప్పటికి న్యాయాన్యాయాల విచారణ అక్కర లేకపోయె కదా అని నేను విచారించేను.

పొద్దుటి పూట ఇంటి యజమానురాలు చిక్కుడు కాయలు కోసుకోడానికి వచ్చి "అయ్యో! అయ్యో! అయ్యో!" అంది.

ఏదేనా పాము కనబడ్డదేమో అని నేను "ఏమిటేమిటి!" అని హడావిడిగా పెరట్లోకి పరుగెత్తేను.

"ఎంత తీగముక్క వదిలిపోయిందో! ఇన్ని పువ్వులు, పిందెలతోటి! అయ్యో! అయ్యో!" అంది.

"రాత్రి ఎవరేనావచ్చి హడావిడి దొంగతనం చేసి పోయేరేమో!" అని ఓదార్చబోయాను.

"అయితే మీరిక్కడుండి ఏమిటి చేస్తున్నారు? ఎవరేనా వచ్చి దొంగతనంగా ఎత్తుకుపోతూంటే కనుక్కోవద్దూ?" అంది.

"చాలా బాగానే ఉంది!" అని మనస్సులో అనుకొని "మమ్మల్ని ఇక్కడేమేనా కాపలాకి పెట్టేరా ఏమిటి మీరు?" అని అడిగేను.

"మీ వాటాముందు వస్తువేది పోయినా మీదే బాధ్యత!" అంది నిష్కర్షగా.

"కాయలు కోసుకొనే బాధ్యత మీదీను తీగను కాపలా కాచే బాధ్యత మాదీనా? ఎప్పుడేనా గుప్పెడు కాయలు పెట్టిన పాపాన పోయేరా మీరు?" అని మనస్సులో కోపాన్ని వెళ్ళగక్కేను.

"ఈ పెరటిలో ఉండే చెట్లు చేమలు మీకు రాసిచ్చే మనుకొన్నారా?"

"ఈ పందిరి కింది తుక్కుని ఎవరెత్తుతున్నారనుకొన్నారు?"

"ఎత్తకపోతేమానుకోండి" అందినిర్దయగా.

నేను నిలువునా నీరయిపోయేను. కాయలు కోసుకొని ఆవిడ చల్లగా అవతలకి దాటి పోయింది. ఈ లోకంలో న్యాయానికెక్కడా తావున్నట్లు కనబడలేదు. అన్యాయం ఇంతగా ప్రబలిపోతుంటే కళ్ళతో చూస్తూ ఏలాగూరుకోను అని ఆలోచించేను. చిక్కుడు తీగను సమూలంగా లాగివేసి, పందిరి పీకివేసి అన్యాయాన్ని పాతమార్చ దలుచుకొన్నాను.

"పువ్వులతో కాయలతో ఉన్న తీగను తీసివేస్తే చిక్కుడు శపిస్తుందండి!" అని మా ఇల్లాలు ధర్మసూక్ష్మం చెప్పబోయింది. ఈ పాటికి చాలించమన్నాను.

నేను అన్నంత పనీ చేశాను. రాటలు, వెదుళ్ళు తీసుకువెళ్ళి మా పొరుగువాళ్ళకి ఇచ్చివేశాను. నేల అంతా తుడిచి నీళ్లు చల్లి ముగ్గు పెట్టివేశాను.

ఇంటావిడ తెల్లవారి ఎప్పటిలాగే కాయలు కోసుకోడానికి వచ్చింది.

గుమ్మందగ్గిరే నిల్చున్న నేను "చూశారా ఇంటిముందు ఎంత తెరిపిచ్చిందో?" అన్నాను చిరునవ్వుతో.

ఆవిడ చెంపను వేళ్లువేసుకొని విస్తుపోయింది.

"అమ్మా! మీకు కాయలూ లేవు, మాకు ఆకులూ లేవు. పొరుగువాళ్ళ కర్రల్ని వాళ్లు తీసుకుపోయేరు." అన్నాను.

అయిపోయిన దానికి ఏమంటే ఏమి లాభమని కాబోలు ఆమె ఊరుకొంది.

నాటినుంచీ మాకూ మాకూ నిప్పేచీ అయింది.